## 'స్నేహితురాలి గురించి ఆమె వేసిన అంచనా నిజమైందా?

# అంచనా





'నాకు కలిగిన కష్టాన్ని తెలిసి రమణి తట్టుకోగలదా?'

హైడ్ పార్క్‌లో కూచుని తీవ్రంగా ఆలోచిస్తోంది కిరణ్మయి. మనిషి లండన్‌లో ఉన్నా మనసంతా చెన్నైలో ఉన్న తన ప్రాణ స్నేహితురాలి మీదే ఉంది. గడచిన ఆరేళ్లలో తాను సాధించిన ప్రగతిని ఎప్పటికప్పుడు తన ప్రాణమైన రమణికి తెలియజేస్తూ ఆనందించింది. కాని గత నాలుగు వారాల్లో జరిగిన భయంకరమైన సంఘటనలన్నీ తెలిసి తనకు కల్గిన కష్టానికి తన స్నేహితురాలు ఎంతగా కుమిలిపోతోందోనన్న ఆందోళన కిరణ్మయిని వేధించసాగింది.

హేండ్ బేగ్ తెరిచి రాయల్ బ్రాంప్టన్ ఆ హాస్పిటల్లో అబ్‌స్టెట్రిషియన్ ఇచ్చిన మెడికల్ రిపోర్ట్ మరోసారి చూసుకుంది. అప్రయత్నంగా కన్నీళ్లు బుగ్గల మీదుగా జారి మెడికల్ రిపోర్ట్ మీద పడ్డాయి. తానూ ఒక డాక్టర్ కావడంవల్ల తనగురించి తనకి సులభంగా అర్థమైంది. ఇక జీవితంలో తనకి పిల్లలు పుట్టరని నిర్ధారణైంది. రుమాలుతో కన్నీళ్లు తుడుచుకుని అనాలోచితంగా పక్కకి చూసింది. పెరాంబ్యులేటర్లో ముద్దులొలికే బాబుని పార్క్‌లో నడిపించుకుంటూ వెడుతున్న తల్లితండ్రులను చూసేసరికి తన బాధ రెట్టింపైంది. నెల రోజుల క్రితం వరకూ తాననుభవించిన ఆ ఆనందం ఇక ఈ జన్మలో తాను పొందలేదు.

మరణించిన తన కొడుకు తిరిగి రాడని తెలుసు. ఎలాగోలా గుండె రాయి వేసుకోగల ధైర్యం ఆమెలో ఇంకా పోలేదు. కాని కిరణ్మయి మనోవేదనంతా తన ప్రాణానికి



ప్రాణమైనా రమణి కోసమే. అసలే దేవుడి లాంటి తండ్రిని పోగొట్టుకున్న బాధ మర్చిపోకముందే ఆమెకు ప్రాణ సమానమైన తనకి కలిగిన కష్టాన్ని తెలిసి ఆమె బలహీనమైన గుండె తట్టుకోగలదో లేదోనని సతమతమయ్యింది కిరణ్మయి.

** ** **

హవుస్ సర్జన్ పూర్తిచేసుకుని

సంపూర్ణ డాక్టర్‌గా పట్టాలు పొందిన ఆ సాయంత్రం —

రామకృష్ణా బీచ్‌లో ఆలోచిస్తూ కూచుంది కిరణ్మయి. ఆమె ఒడిలో తలపెట్టుకుని అమాయకంగా చూస్తోంది రమణి. ఒకప్రక్క కువైట్ వెడుతున్నానని ఆనందం, మరోప్రక్క తన ప్రాణానికి ప్రాణమైన రమణికి దూరమవుతున్నాననే బాధ ఆమె మనసులో చోటు చేసుకున్నాయి.

''రమణీ!'' తన ఒళ్లో పడుకున్న రమణి జుట్టు నిమురుతూ మృదువుగా పిలిచింది కిరణ్మయి.

''ఊ''

''ఈ అక్కయ్యని మర్చిపోవు కదూ?'' అప్రయత్నంగా కిరణ్మయి కళ్లు చెమర్చాయి.

''ఏమిటక్కా అలా అడుగుతున్నావు. ఈ ప్రపంచంలో నా మనిషంటూ ఎవరేనా ఉంటే అది నువ్వుకాక మరెవరు? పన్నెండో ఏటనే తల్లిని పోగొట్టుకున్నాను. మా ఇంట్లో నన్నర్థం చేసుకునే నా వయసు వాళ్లెవరూ లేరు. ఒకే తల్లి కడుపున పుట్టకపోయినా స్వంత అక్కా చెల్లెళ్ళ కంటె ఎక్కువగా ఏడేళ్లు క్లాస్‌మేట్స్‌గా, రూంమేట్స్‌గా కలిసి మెలిసి ఉన్నాం. నా ప్రాణానికి ప్రాణమైన నిన్ను మర్చిపోగలనా?–'' ఎప్పటిలాగే కిరణ్మయి మీద అభిమానం ఒలకబోసింది రమణి.

అనాలోచితంగా రమణి మెడవైపు చూసింది కిరణ్మయి.

''రమణీ! నీ మెడలోని ముత్యాలహారం ఏది?'' సీరియస్‌గా అంది కిరణ్మయి.

''నువ్వు క్షమిస్తానంటే చెప్తాను'', భయంతో వణుకుతూ అంది రమణి.

''చెప్పు'', తన సీరియస్‌నెస్‌లో ఆమె పట్ల అభిమానాన్ని, బాధ్యతని వ్యక్తం చేసింది కిరణ్మయి.

''ఈ రోజు ఉదయం మనం ఉచిత వైద్య శిబిరం నిర్వహించాం కదక్కా! అక్కడ సముద్ర తీరంలో చేపలు పట్టే జాలరులను చూస్తే జాలివేసింది. మనం రాసిచ్చిన మందులు కొనుక్కునే స్థితి వాళ్లకి లేదుగా. అందుకే నా ముత్యాలహారం అమ్ముకుని మందులు కొనుక్కోమన్నాను'', కిరణ్మయి మనసు కరిగేలా కంట తడి పెట్టుకుంటూ జాలిగా అంది రమణి.

''ఓసి తెలివి తక్కువ దద్దమ్మా! మనం వైద్యశాస్త్రం చదువుకున్నది వైద్యం చెయ్యడం కోసం గాని, మనకున్నవన్నీ ఇతరులకిచ్చేసి రేపట్నుంచి మనం బిచ్చమెత్తుకోడానిక్కాదే. చదవేస్తే ఉన్నమతి పోయిందట. ఛీ. మొన్నకు మొన్న నీ పగడపు ఉంగరమమ్మేసి దానం చేశానన్నావు. ఇవాళ ముత్యాల హారం ఇచ్చేశానన్నావు. రేపు చెన్నైలో ఉన్న నీ ఇల్లు, వాకిలీ కూడా అమ్మేస్తావా?'' కోపంగా అంది కిరణ్మయి.

''క్షమించక్కా. ఇక నుంచి నీతో చెప్పకుండా ఏ పనీ చెయ్యను'', వినయం వట్టిపడుతూ అంది రమణి.

''ఇన్నాళ్లూ దగ్గరుండి నీ బాగోగులు చూసేదాన్ని. ఇకముందు ఎలా బ్రతుకుతావో! నీలాంటి అమాయకురాలు మెడిసన్ చదవడం చాలా తెలివి తక్కువపని. అందరు డాక్టర్లూ లక్షలార్జిస్తుంటే నువ్వు

మాత్రం ఒంటి మీద నగలు కూడా పేదవాళ్లకి దానం చేశావు. ప్చ్... పిచ్చిపిల్ల. చూడు రమణీ! నేను దూరంగా ఉన్నానని బెంగపెట్టుకోకు. నేను కువైట్‌లో పాతిక లక్షలు సంపాదించగానే ఇండియాకు తిరిగొస్తాను. మంచి ప్రాంతం చూసి ఇద్దరం కలిసి ప్రైవేట్ ప్రాక్టీసు పెట్టుకుందాం. ఈలోగా నువ్వు చెన్నైలో అనుభవం సంపాదించు. ప్రభుత్వోద్యోగం కోసం ప్రయత్నించు. నీలాంటి వెర్రిబాగుల మనిషి ప్రైవేట్ ప్రాక్టీసు చేస్తే సంపాదన మాట దేవుడెరుగు, ముందు నీ ఇల్లు వాకిలీ పేదవాళ్ళ ధారాదత్తం చేసేస్తావు. నువ్వు ఎలా ఉన్నదీ, ఏం చేస్తున్నదీ ఎప్పటికప్పుడు నాకు ఉత్తరాల్లో రాస్తుండు'', అని ఓ నిమిషం సీరియస్‌గా ఆలోచించి ''రమణీ! పెళ్ళి విషయంలో మాత్రం తప్పటడుగు వెయ్యకు. నీ వెనకాల ఉన్న ఆస్తిని చూసి, మీ నాన్నగారి వ్యాపారం చూసి నీమీద ఎందరో కన్ను వేసుంచారు. నిన్నర్థం చేసుకుని, నిన్ను మనస్పూర్తిగా కోరుకునే వాణ్నే చేసుకో. అంతగా నువ్వు నిర్ణయం తీసుకోలేక పోతే నాకు ఉత్తరం రాయి. నీకోసం ఎప్పుడు రమ్మన్నా వస్తాను. ఈ పురుషాధిక్య ప్రపంచంలో నీలాంటి డబ్బున్న అమాయకురాలిని దోచి వెయ్యాలని ఎందరో చూస్తుంటారు. జాగ్రత్త'', అని రమణిని కౌగలించుకుంది కిరణ్మయి.

ఇద్దరూ ఎడబాటవుతున్న ఆ సమయంలో భాషకందని బాధని లోలోపల దాచుకుంది కిరణ్మయి.

రమణి తన స్వంత ఊరైన చెన్నై వెళిపోయింది. ఆ మరుసటిరోజు ఉద్యోగంలో చేరడానికి కిరణ్మయి కువైట్ వెళ్లిపోయింది. ఆమె వెళ్లిన దగ్గర్నుంచీ వారానికో ఉత్తరం రాస్తూనే ఉంది. రమణి మాత్రం బద్ధకానికి పెట్టింది పేరన్నట్లు అప్పుడూ అప్పుడూ ఓ ఏరోగ్రాం రాసి పడేస్తూండేది. కిరణ్మయి వెళ్లిన ఓ ఏడాదికి ఒక ముఖ్యమైన విషయం రాసింది.



కువైట్
15.12.1993

నా ప్రియమైన చెల్లెలు రమణికి,

మీ అక్క కిరణ్మయి వ్రాయునది. నేను జీవితంలో ఏ చిన్న పనిచేసినా నీతో చెప్పకుండా చెయ్యలేదు. కాని నా జీవితంలో ఒక ముఖ్యమైన పని పరిస్థితులు కారణంగా ముందుగా నీకు తెలియకుండా చేశాను. అక్కయ్య మీద కోపగించుకోవు కదూ! క్రిందటి నెల కువైట్‌లో నాకు పెళ్లైంది. అతను మన ప్రాంతం వాడే. దేశం వదిలి వచ్చినా సంప్రదాయాలు వదలని అతను నన్ను చూసి మనస్ఫూర్తిగా ఇష్టపడ్డాడు. అతను కూడా నాలాగే డాక్టర్. మంచి ఆదర్శవాది. ఈసారి ఇండియాకి వచ్చేటప్పుడు ఇద్దరం కలిసి ముందుగా మీ ఇంటికే వస్తాం. ఓ.కే?

ఈ మధ్య నువ్వు ఉత్తరాలు రాయడం తగ్గించేశావు. నువ్వు నాకోసం బెంగపెట్టుకున్నట్లే. నేనూ నీకోసం బెంగ పెట్టుకోనూ? వెంటనే ఉత్తరం రాయి.

నీ అక్క
కిరణ్మయి

కువైట్‌లో కిరణ్మయి దినదినాభివృద్ధి చెందుతుండగా చెన్నైలో రమణి ఉద్యోగంలో చేరింది. ఒక ప్రక్క ఉద్యోగం మరో ప్రక్క ప్రైవేట్ ప్రాక్టీసుతో రమణి జీవితం మూడు పువ్వులారుకాయలుగా సాగింది. అలా ఆరు సంవత్సరాలు గడిచిపోయాయి.

ఒక రోజు — హాస్పిటల్‌కి బయల్దేరు తుండగా రమణి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. ఆత్రంగా విప్పి గబగబా చదివింది కిరణ్మయి. రమణి తండ్రి మరణించాడన్న విషయం చదివే సరికి ఆమె మనసంతా వికలమైపోయింది. ఆ విషాద సమయంలో తన ప్రాణానికి ప్రాణమైన రమణి ఎలా కుమిలిపోతోందనని సతమతమయింది కిరణ్మయి.

మనసు బాగులేక హాస్పిటల్ నుంచి ఇంటికి రాగానే తన మూడేళ్ల కొడుకుని తీసుకుని కువైట్‌లో షాపింగ్‌కి బయలుదేరింది కిరణ్మయి. బాబుక్కావల్సిన ఆట వస్తువులు, బట్టలు అన్నీ తీసుకుని బిజీ రోడ్డు మీద ఎడమ చేత్తో సామాన్లు పట్టుకుని కుడిచేత్తో బాబు చెయ్యి పట్టుకుని నడుస్తోంది కిరణ్మయి. మనిషి కువైట్‌లో యాంత్రికంగా కదులుతోందే తప్ప మనసు మనసులో లేదు. ఆమె మనసంతా రమణిని గురించిన ఆలోచనలతో నిండిపోయింది. 'నాతో బాటే రమణి కూడా కువైట్ వచ్చి తాను కూడా ఓ మంచి డాక్టర్ని పెళ్లిచేసుకుని ఉంటే మా రెండు కుటుంబాలు ఎంత సరదాగా గడిపేవాళ్లం! పిచ్చిపిల్ల. అమాయికత్వానికి ప్రతిరూపం రమణి. తండ్రిపోయిన దుఃఖంలో ఎలా కుమిలిపోతోందో ఏమో! అక్కయ్య దగ్గరలేదని ఎంత బాధపడుతోందో!' ఆలోచిస్తున్న కిరణ్మయి ఒక్కసారి కెవ్వున కేకపెట్టింది. ఎనభై కిలోమీటర్ల వేగంతో వెడుతున్న కారు తన ముద్దులు మూటగట్టే మూడేళ్ల బాబుని క్షణంలో పొట్టనపెట్టుకుంది. ఒక్కసారి తన మీద పిడుగు పడినట్లైంది.

రక్తంతో తడిసిన బాబు శరీరాన్ని తన కళ్లతో చూడలేకపోయింది కిరణ్మయి. ఒక క్షణం ఆమెకు గుండె ఆగినట్లైంది. కళ్ళు చీకట్లు కమ్మాయి. చుట్టు ప్రక్కల జనం ఆమె చుట్టూ మూగారు. కనీసం కన్నీళ్లు కార్చే ఓపిక కూడా లేనంతగా శక్తి సన్నగిల్లింది.

ఎన్నో ఏళ్లుగా పెంచుకున్న ఆశలు, కన్నకలలు, ఆత్మవిశ్వాసం, భవిష్యత్తు మీద నమ్మకం ఒక్కసారిగా ఆమెలో మాయమయ్యాయి. భరించరాని పుత్రశోకం తనని దహించి వేసింది. భర్త ఎంత ధైర్యం చెప్పినా తన మనసు కుదుట పడటల్లేదు. జీవితంలో కలలో కూడా ఊహించని అలాంటి కష్ట సమయంలో రమణిని కలిసి తన బాధను చెప్పుకోడమే తనకంటూ మిగిలిన ఓదార్పు. అందుకే ఒకసారి స్వదేశానికి తిరిగి రావాలని నిర్ణయించుకుంది.

"ఇండియాకి వెళ్లేముందు ఒకసారి లండన్ వెళ్లడం మంచిదేమో! రాయల్ బ్రాంప్టన్ హాస్పిటల్లో ఒకసారి పరీక్ష చేయించుకుంటే మళ్లీ పిల్లలు పుట్టే అవకాశం ఉన్నదీ లేనిదే నిర్ధారణవుతుంది" అని భర్త ఇచ్చిన సలహా ప్రకారం లండన్ వెళ్లింది కిరణ్మయి.

** ** **

లండన్ వచ్చాక ఉన్న ఆ ఒక్క ఆశ కూడా నిరాశ అయ్యింది.

హైడ్ పార్క్‌లోంచి అనాలోచితంగా నడవడంతో కెనింగ్‌స్టన్ రోడ్డుకు బదులు ఆక్స్‌ఫర్డ్ రోడ్డుకు చేరుకుంది. దారిలో కనిపించిన చారిత్రాత్మక కట్టడాలుగాని, ఆకర్షణీయమైన శిల్పకళా నైపుణ్యం వట్టిపడే కట్టడాలుగాని ఆమె దృష్టికెక్కలేదు.

తన చిన్నతనంలో లండన్ గురించి ఎంతో గొప్పగా చెప్పుకోడం వింది. అలాంటి లండన్ నగరం ఒక విషమ పరిస్థితిలో బాధాకరమైన విషయం తెలుసుకోడానికి వస్తానని కిరణ్మయి ఊహించలేదు.

మరో గంటకి గ్రాస్ వెనార్ హవుస్



## జుట్టు!

భర్తతో అంది భార్య

"ఏమండీ జుట్టు రాలిపోకుండా ఉండడానికి మందు తెచ్చాను. ఇది వాడితే జుట్టు అసలు రాలిపోదు"

"నా జుట్టు ఏమీ రాలిపోవడం లేదే!"

"మీ కోసం కాదు.. మీ సెక్రటరీకి పాపం ఆమె గారి జుట్టు రాలి మీ కోటుమీద పడుతోంది"

– కె.వి.మధుసూదనరావు (కాకినాడ).

చేరుకుంది. అక్కణ్ణుంచి తన రూంలోకి వెళ్లి మెడికల్ రిపోర్ట్ మరోసారి చూసుకుని తలగడలో ముఖం దాచుకుని ఏడ్చింది. ఫోన్ మ్రోగడంతో లేచి ఫోనందుకుంది. తన విషయాన్ని బాధగా భర్తకి చెప్పింది.

"గతాన్ని త్రవ్వుకుని మనం చెయ్యగల్గేదే ముంది. భవిష్యత్తు మనం ఊహించినట్లు జరగదు. దైవాజ్ఞ ప్రకారం నడుచుకోడమే మన కర్తవ్యం. నీ ప్రాణంలో ప్రాణమైన స్నేహితురాల దగ్గరే నీక్కాస్త మనశ్శాంతి దొరుకుతుంది. వెంటనే బయల్దేరి చైన్నై వెళ్ళు. నీలు చూసుకుని నేను కువైట్ నుండి నేరుగా చెన్నై వస్తాను" అన్నాడు కిరణ్మయి భర్త.

అవును. అదొక్కటే తాను చెయ్యగలిగేది. ఈ లోకంలో తనకంటూ ఉన్న తన వ్యక్తి రమణి ఒక్కత్తే. మెడికల్ కాలేజీలో చదువుతుండగా ఏడేళ్లపాటు అమాయికత్వానికి ప్రతిరూపమైన రమణిని ఓదారుస్తూ, ధైర్యం చెబుతూ ఆమెను రాత్రింబగళ్లు చదివించింది కిరణ్మయి. ఇప్పుడు తన పెద్దరికం రమణి తీసుకుని తనని ఆమె ఒడిలో పడుకోబెట్టుకుని ఓదారుస్తుంది. రమణి ఒడిలో తలపెట్టుకుని తన బాధనంతా కన్నీళ్లతో బయటికి పంపేదాకా మనశ్శాంతి పొందలేదు కిరణ్మయి. కానీ... తండ్రిని పోగుట్టుకున్న బాధలో ఉన్న రమణి, పుత్రశోకంతో ఉన్న తానూ ఆరేళ్ల తరువాత కలుసుకునే ఆ సమయంలో ఇద్దరికీ దుఃఖం ఆగుతుందా!

ఆ సమయంలో ఎవర్ని ఎవరు ఓదార్చుకోవాలి? కాలేజి హాస్టల్లో ఉండే రోజుల్లో తనకి తలనొప్పిగా ఉంటే రమణికి నిద్రపట్టేది కాదు. ఇప్పుడు తన స్నేహితురాలి కష్టం తెలియగానే రమణి మానసిక పరిస్థితి ఎలా మారుతుందో!

ఏవేవో ఆలోచనలతో హీత్‌రో విమానాశ్రయంలో విమానం ఎక్కింది కిరణ్మయి. మీనంబాకంలో విమానం దిగడంతోటే ఆమె కళ్ళు ఆత్రంగా రమణికోసం వెతికాయి. 'టెలెక్స్ మెసేజ్ అంది ఉండకపోవచ్చు. లేకపోతే రమణి తనకోసం రాకుండా ఉంటుందా!'

టాక్సీ చేసుకుని ఐక్యభారత వలస వెళ్లింది కిరణ్మయి. టాక్సీ రమణి ఇంటి ముందు ఆగడంతో లోలోపల్నుంచి పొంగుతున్న బాధని అతికష్టమ్మీద ఆపుకుంది. టాక్సీకి డబ్బులిచ్చి ముందుగదిలో అడుగు పెట్టింది కిరణ్మయి. అప్పుడే ముస్తాబై వేనిటీ బ్యాగ్ చేత్తో పట్టుకుని మేడమెట్లు దిగుతోంది రమణి. ఆరేళ్ల తరువాత తన బహిప్రాణాన్ని కళ్లారా చూసుకున్న కిరణ్మయి కళ్లు నీళ్లతో నిండి చూపు మసకైంది. కన్నీళ్లు తుడుచుకుని రెండు మెట్లెక్కింది కిరణ్మయి.

"హాయ్, కిరణ్మయి! సమయానికొచ్చావు. ఈ రోజు తాజ్‌లో నా ఫ్రెండ్స్ నాకు ఘనంగా పార్టీ ఇస్తున్నారు. నువ్వు కూడా రా. అక్కడ మాట్లాడుకుందాం", ఎక్కడా లేని సంతోషంతో అంది రమణి.

ఒక్క క్షణం తనకళ్ళని తాను నమ్మకలేకపోయింది కిరణ్మయి. తాను చూస్తున్నది ఒకనాటి తన ప్రాణ స్నేహితురాలినేనా అని ఆశ్చర్యంలో మూలిగింది. నోట మాట

రాక మౌనంగా ఉండిపోయింది.

"ఏమిటే అలా ఆశ్చర్యంగా చూస్తున్నావు? ఓ వెర్రిబాగుల రమణికి ఇంత ధైర్యం, ఇన్ని తెలివి తేటలు ఎలా వచ్చాయనా? మనం మెడికల్ కాలేజీలో చదువుతుండగా మీరంతా మధ్య తరగతి కుటుంబీకులు. మీ తల్లితండ్రులు వాళ్ల కడుపు కట్టి పెట్టుకుని మిమ్మల్ని మెడిసన్ చదివించారు. కాని మా నాన్న కోటీశ్వరుడు. మీ అందరి సరదాల కోసం మీరంతా నన్నెక్కడ ప్రాణం తీస్తారోనని లేని అమాయకత్వం నటించక తప్పలేదు. కాని ఇప్పుడు గల్ఫ్‌లో నువ్వు కోట్లు కూడబెట్టి ఉంటావు. ఇంక నీదగ్గర నాకు దాపరికమెందుకు", జాలరులకిచ్చేశానన్న ముత్యాలహారం మెడలో సవరించుకుంటూ అంది రమణి.

"రమణీ!" ఆశ్చర్యంగా అంది.

"తరువాత తీరిగ్గా ఆశ్చర్యపోదుగానీ, ముందు నాతో రా", అని మెట్లు దిగింది రమణి.

"ఏమిటే, దేవుడిలాంటి తండ్రిని పోగొట్టుకున్న నువ్వూ, ఎదుగుతున్న మూడేళ్ల కొడుకుని పోగొట్టుకున్న నేనూ పార్టీలకి వెళ్ళే స్థితిలో ఉన్నామా?" బాధగా అంది కిరణ్మయి.

"ఓసి నీ తెలివి తెల్లవారా! నువ్వేదో గల్ఫ్‌లో కూడబెట్టిన కోట్లాది ధనంతో చెయ్యబోయే కార్యక్రమాలన్నీ నాకు చెప్తావని నేనెదురు చూస్తుంటే, సంపాదనలేని మా రోగిష్టి తండ్రి చచ్చాడని నేనేడుస్తూంటే చూడ్డానికీ, బొడ్డూడని కొడుకు చచ్చాడని ఏడవడానికేనా నువ్వు ఇండియా వచ్చింది!" పగలబడి నవ్వింది రమణి.

టొయోటా ఎ.సి.కారు గేటు ముందు రాగింది. స్వయంగా నడుపుతున్న కుర్రవాడు ఒక్కడే ఆ కార్లో ఉన్నాడు.

"మీ వారొచ్చినట్లున్నారు" అంది కిరణ్మయి.

"ఆయన మా వారు కాదే. రెండో పెళ్లివాడైనా ఇంతకంటె అందగాడు.

## సైనికవ్యయం

ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే సంపదలో 30 శాతం సైనిక అవసరాలకే ఖర్చవుతున్నది. ప్రపంచ సైనిక ఖర్చులో ఒక్క శాతం ప్రక్కన పెడితే, ఆ డబ్బుతో ఆకలితో అలమటిస్తున్న 20 కోట్ల మంది పిల్లలకు కడుపు నిండా తిండి పెట్టవచ్చుట.



వడ్డాక్టర్ ఆళ్ల

అతను నా సరదాలకి అడ్డుపడడు. అతనిలో అంతటి ఆదర్శాన్ని చూసే పెళ్ళి చేసుకున్నాను. ఇతను నా ఫ్రెండ్. చాలా సరదాగా, జోవియల్‌గా ఉంటాడు. ఇంతకీ నాతో వస్తావా! రావా!'' బయటికి వెళ్లడానికి హడావుడిపడుతూ అంది రమణి.

''నా పరిస్థితిని అర్థం చేసుకునే అంటున్నావా?''

''సరే, నీ ఖర్మ. ఇంట్లో చారు, అన్నం తిని పడుకో. బొడ్డూడని కొడుకు పోయాట్ట. ఏదో కోటీశ్వరుడైన బాయ్‌ఫ్రెండ్ నిన్నొదిలేసి మరొకదానితో పోయినట్లుంది నీ ఏడుపు'', అని విసురుగా వెళ్లి కార్లో కూచుని కారు నడుపుతున్న అందగాడి మెడచుట్టూ చేతులు వేసింది రమణి.

రమణి పెదవుల్ని తన పెదవులతో స్పర్శిస్తూ కారు పోనిచ్చాడు అందగాడు.

కదుల్తున్న కారును కన్నార్పకుండా చూస్తూ మనుషుల్ని అంచనా వెయ్యడంతో తానెంత పొరపాటు చేసిందో అర్థం చేసుకుంది కిరణ్మయి.

